క్లుప్తంగా...

గోషామహల్ ఏసీపీగా వెంకట్‌రెడ్డి



అబిడ్స్: గోషామహల్ డివిజన్ నూతన ఏసీపీగా కె.వెంకట్‌రెడ్డి పదవీబాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లుగా డివిజన్ ఏసీపీగా పనిచేసిన సతీస్‌కుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకట్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఆయన అన్నారు. డివిజన్ పరిధిలోని షాహినాయత్ గంజ్, మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్థానిక ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్లు అజయ్‌కుమార్, ఎస్.రవి ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

25న ఉస్మానియా జేఏసీ బోనాలు



బోనాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ఈనెల 25న ఉస్మానియా ఆస్పత్రిలో బోనాల జాతర నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో బోనాల జాతర పోస్టర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను ఆధ్యాత్మిక భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు శ్యామ్‌సుందర్, సురేష్, రవిగౌడ్, శివకుమార్, అనిల్‌కుమార్, నర్సింగ్‌రావు, శివ, మోహన్, దేవయ్య, భాస్కర్, రాములు, రాజేష్, నరేందర్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో శాంతి పూజ



గోల్కొండ: గోల్కొండ కోట ఆషాఢ బోనాలు ప్రశాంతంగా ముగిశాయి. దీనిని పురస్కరించుకుని ఆదివారం గోల్కొండపై కొలువుదీరిన మహంకాళి అమ్మవారికి వృత్తి పనిసంఘం వారి ఆధ్వర్యంలో శాంతి పూజలు జరిగాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుతూ ఈ పూజలు నిర్వహించామని అమ్మవారి వృత్తి పని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. ఆలయ పూజారి సురేష్ చారి పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో వృత్తి పనివారు తదితరులు పాల్గొన్నారు.

దాతలు ఆదుకోండి!



చికిత్స పొందుతున్న మునేందర్

జియాగూడ: జియాగూడ మాజీ కార్పొరేటర్ మునేందర్‌కు గురువారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరారు. ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తి ఆసుపత్రిలో బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. 2011లో జియాగూడ కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు జియాగూడ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన మునేందర్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన భార్య వినోదిని, కూతురు మౌనిక వేడుకుంటున్నారు. గుండెపోటు రావడంతో ఇతని పరిస్థితి మరింత దారుణంగా మారింది. భార్య, కూతురు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. బీజేపీ పార్టీ హైకమాండ్‌తో పాటు ఎవరైన దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాలనుకునే వారు 99485 98009, 70750 82551 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కుల్సుంపురాలో ఆపరేషన్ చబుత్ర



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చబుత్రాలపై అర్ధరాత్రి వరకు కూర్చుంటున్న యువకులను పోలీస్‌స్టేషన్ తరలించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్, సంజయ్‌నగర్, కేశవస్వామినగర్, జియాగూడ తదితర ప్రాంతాల నుంచి 14 మంది యువకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

గుంతల రోడ్లు.. ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు



వర్షానికి దెబ్బతిన్న రోడ్డు



గోల్కొండలో అసంపూర్తిగా రోడ్డు పనులు

- వర్షాలకు ధ్వంసమవుతున్న రహదారులు
- రాకపోకలకు ఇబ్బందులు
- ఫిర్యాదు చేస్తున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు



మెహదీపట్నంలో ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారుతుండగా మోరీలు పొంగి పొర్లుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల నోళ్లు తెరిచి ప్రమాదకరంగా మారాయి. పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సగంలోనే ఆగిపోవడంతో ఆ ప్రాంతాలు కూడా బురదమయంగా మారాయి. గుడిమల్కాపూర్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులపై గుంతలు పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గుంతల్లో వరదనీరు చేరడంతో వాహనదారులకు కనబడక ప్రమాదాలకు గురవుతున్నారు. అహ్మద్‌నగర్ మెయిన్ రోడ్డు, నానల్‌నగర్ నుంచి ఫ్లోర్ మిల్ వరకు వెళ్లే రోడ్డు వర్షాలకు పూర్తిగా అధ్వానంగా మారింది. ప్రీమియర్ ఆస్పత్రి నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా వెళ్లే రోడ్డు సైతం గుంతలమయంగా మారింది. గోల్కొండ ఖాజీ గల్లీ మోతీ దర్వాజ రోడ్డు బురదమయంగా మారింది. మోతీ మహల్-మోతీ దర్వాజ రోడ్డుపై గత వారం పూడికలు తీయడానికి డ్రైనేజీల మ్యాన్‌హోళ్లను తీశారు. మ్యాన్‌హోళ్ల మూతలు పెట్టకపోవడంతో ఆ ప్రాంతం మొత్తం బురదమయంగా మారింది. టోలిచౌకి చౌరస్తా నుంచి ఎండీ లైన్స్ వెళ్లే రోడ్డుపై ఉన్న తారు కొట్టుకుపోయి మట్టి రోడ్డుగా మారింది. టోలిచౌకి చౌరస్తా నుంచి హకీంపేట్ వెళ్లే రోడ్డుపై గుంతలు పడ్డాయి. టోలిచౌకి ఫ్లై ఓవర్ కింది భాగంలో పైప్‌లైన్ కోసం తవ్విన మట్టి వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. అహ్మద్‌నగర్ డివిజన్‌లోని బడాబజార్ రోడ్డు వర్షాలకు బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై పాదచారులు నడవాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తూతూ మంత్రంగా పర్యటిస్తున్నారే తప్పా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ప్రధాన రహదారులు, కాలనీలలోనే చెత్త తరలిస్తున్నారే తప్పా పేదల బస్తీల్లో చెత్త కుప్పలు ఎక్కడికక్కడే పడి ఉంటున్నాయని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు.

అలరించిన సంస్కృత కళారాధన



విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేస్తున్న జయ ప్రకాష్‌నారాయణ, చిత్రంలో సురభి లక్ష్మీ శారద

నాంపల్లి: పద్మ విభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణకు నివాళిగా సంస్కృతి కార్పొరేట్ సర్వీసెస్, సురభి అకాడమీ సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ఉదయం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో 'సంస్కృత కళారాధన-2023'పేరిట సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వల్లూరి జయ ప్రకాష్ నారాయణ, సంగీత దర్శకులు డాక్టర్ ఆరిపిరాల కల్యాణ్‌శాస్త్రి, సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్, సుప్రీంకోర్టు న్యాయవాది కిలారు దిలీప్‌లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి, వాయిద్య సంగీతం, గాత్ర సంగీతం, జానపద నృత్యాలు అలరించాయి. సాయంత్రం జరిగిన ముగింపు సభకు ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాస రావు హాజరై విద్యార్థులకు నతలస్య మయూరి, స్వర మాధురి, వాద్య సమ్మోహనాచార్య, స్వర గంధర్వ అవార్డులను, గురువులకు కళా భూషణ్, కళా భూషిత అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు సంస్కృతి కార్పొరేట్ సర్వీసెస్ అధినేత డాక్టర్ ఆరిపిరాల కల్యాణ్ శాస్త్రి, సురభి అకాడమి డైరెక్టర్ సురభి లక్ష్మీ శారద సమన్వయం చేశారు.

నానల్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన



నానల్‌నగర్ డివిజన్‌లో వాన పరిస్థితిపై చర్చిస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: వర్షం వల్ల దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేయిస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దెబ్బతిన్న రోడ్లు, పొంగుతున్న డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడారు. రోడ్లపై వరదనీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, దీనికిగాను స్పెషల్ మాన్‌సూన్ టీంల సేవలను అందుబాటులో తెచ్చామన్నారు. మరోవైపు పొంగుతున్న డ్రైనేజీలకు వెంటనే పూడికలు తీయించి మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. దిగువ ప్రాంతాలైన టోలిచౌకి, నదీమ్ కాలనీ, గోల్కొండలోని రేతిగల్లి తదితర ప్రాంతాల్లో సహాయక బృందాలను పంపి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, డీఈఈ రామకృష్ణ, మజ్లిస్ నాయకులున్నారు.

వృత్తి పనివారి సేవలకు వెలకట్టలేం



వృత్తి పని వారితో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి సేవలు అందించే వృత్తి పనివారి సేవలకు వెలకట్టలేమని ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం కోటపై గల ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదయ శాఖ తరఫున వృత్తి పనివారికి గౌరవ వేతనంతో పాటు ఒక్కొక్క పని వారికి 30 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాదాయశాఖ వృత్తి పని వారి సేవలను గుర్తించి వారికి సముచితంగా గౌరవ వేతనం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి పని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి, సంఘ సేవకుడు ఎస్. రాజు వస్తాద్, శ్రీకాంత్ చారి, మహంకాళి ఆలయ పూజారి సురేష్ చారి, శివశంకర్ తదితరులున్నారు.

మైనార్టీలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



మైనార్టీల సమావేశంలో ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: మైనార్టీలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్ల మైనార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గతంలో షాదీముబారక్ వంటి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. లక్ష రూపాయల రుణాలను త్వరలోనే ఇవ్వనున్నట్లు తెలిపారు. మైనార్టీలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.



రాజ్ భవన్‌లో ఆదివారం నూతన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధేను కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్మిక శాఖ హైకోర్టు జీపీ డీఎల్ పాండు. – సాక్షి, సిటీబ్యూరో

పాఠశాల నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్ విఠల్ దాస్, కుటుంబ సభ్యులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాల నూతన భవనాన్ని ఆదివారం భవన నిర్మాణత దాత విజయ్‌కుమార్ విఠల్ దాస్, వారి కుటుంబ సభ్యులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి పాఠశాల కమిటీ సభ్యులు వెంకటరమణ రామ్మోహన్ దంపతులు కూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ.. పాఠశాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పాఠశాల అభివృద్ధికి మరికొంత మంది దాతలు ముందుకు రావాలన్నారు. పాఠశాల ప్రధానాచార్యులు సరిత మాట్లాడుతూ.. పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నామన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు





డబీర్‌పురా: ఫరత్‌నగర్‌లోని ఫిలక్‌మాతా ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ ప్రెసిడెంట్ కృష్ణ కుమార్ తెలిపారు. రేపు ఆలయ సమీపంలో రంగం కార్యక్రమం ఉంటుందన్నారు.

గుంతలమయంగా రోడ్డు



గోతులమయంగా మారిన శంషీర్‌గంజ్ రోడ్డు

చాంద్రాయణగుట్ట: రాజన్నబావి నుంచి శంషీర్‌గంజ్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఏడాది క్రితమే నూతన రోడ్డు మంజూరయ్యిందని పేర్కొంటున్నప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. రైస్ మిల్లులు, ఇతర కంపెనీలు ఉన్న ఈ రూట్‌లో నిత్యం పెద్ద ఎత్తున లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. గతంలో తాత్కాలికంగా ఈ గుంతల్లో డస్ట్ పౌడర్‌ను నింపారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రోడ్డు మరింత దెబ్బతింది. బ్యాంక్ పక్క నుంచి తరచూ మురుగునీరు సైతం ప్రవహిస్తుండడంతో స్థానిక వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రూట్‌లో రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.





పార్లమెంటు ముట్టడిని విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

అబిడ్స్: ఆగస్టు 10న ఢిల్లీలో జరగబోయే పార్లమెంటు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అజీజ్, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, శ్రీకంత్ మిశ్రా పేర్కొన్నారు. పాతపెన్షన్ విధానం కార్మిక ఉద్యోగ వర్గాలకే కాక దేశానికి ఎంతో ఉపయోగమన్నారు. రీ స్టోర్ ఓపీఎస్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోని పలు దేశాల్లో పాతపెన్షన్ వ్యవస్థనే ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా ప్రస్తుత పాలకులు ఓపీఎస్ పునరుద్ధరించడం సాధ్యం కాదని పేర్కొనడం దారుణమన్నారు. తిరిగి ఓపీఎస్ ప్రవేశ పెట్టేవరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యునైటేడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు చావా రవి తదితరులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో బీజేపీ నేతల పర్యటన



దేవర వంశీని సన్మానిస్తున్న వాంబే కాలనీవాసులు

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆదివారం ఆయన వాంబే కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు గతవారం రోజులుగా పడుతున్న ఇబ్బందులను వివరించారు. తమ ఇళ్లలోకి వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు వస్తుందని తెలిపారు. రోడ్లపై వస్తున్న వరద నీటితో ఇంటి నుంచి బయటకు రాలేకపోతున్నామని వారు తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ వివిధ శాఖల ఉన్నతాధికారులను కలిసి వివరిస్తామని ఆయన తెలిపారు. ముఖేష్, సుధాకర్, ప్రభు పూజారి తదితరులున్నారు.

మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయండి



రూడావత్ రఘునాయక్

అబిడ్స్: సభ్య సమాజం తలవంచుకునే విధంగా మణిపూర్‌లో సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని తెలంగాణ డాడీ లంబాడి హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రూడావత్ రఘునాయక్ పేర్కొన్నారు. కొన్ని నెలలుగా మణిపూర్‌లో గిరిజన మహిళలపై అమానుష సంఘటనలు చోటుచేసుకోవడం ఎంతో దారుణమన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..కొన్ని నెలలుగా జరుగుతున్న సంఘటనలకు బాధ్యతగా రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలంతా తలవంచుకునేలా, సిగ్గుపడేలా, మణిపూర్‌లో సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

జియాగూడ: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని జియాగూడ నలంద స్కూల్ ప్రాంతంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న 43 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తుతెలియని వ్యక్తిని పోలీసులు గుర్తించారు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230 9010463222 | 9553955684